# అద్దములో

శ్రీమతి పాకలరత్నమాలగారు

రాణీకి నాలుగుసంవత్సరాలు. వచ్చీరానిమాటలతో తలిదండ్రులని ఆనందంలో ముంచేస్తుంటుంది.

ఆనాడు రాణీపుట్టినదినం. గొప్పవేడుకతో జరిపారు. రాణీనిశృంగారించి కుర్చీలో కూర్చోబెట్టిందిఅమ్మ. చూడవచ్చిన పేరంటాండ్రు 'పెళ్ళికూతురులాగా వున్నది రాణీ'అన్నారు. ఆమాటవిని కుర్చీలోంచిలేచి పారిపోయింది రాణి. తరువాత క్లబ్బునుంచి రాణీనాన్నగారువచ్చారు. వచ్చీరావటంతోనే ఎత్తుకోమని తనచిన్ని చేతులందిచ్చింది. రాణీనెత్తుకుని గదిలోకి తీసుకెళ్ళి 'ఇవ్వాళరాణీ చిన్న పెండ్లికూతురులాగుందికదూ' అన్నాడు భార్యతో.

నాన్నదగ్గిరనుంచిదిగి పందిరిమంచముమీద కూర్చున్నది రాణి. 'చూశారా, పెండ్లికూతురన్నారని కోపమొచ్చి దిగిపోయింది. ఇందాకా పేరంటాండ్రు అన్నప్పుడుకూడా ఇల్లాగే పారిపోయిం'దని చెబుతోంది రాణీఅమ్మ.

రాణీమంచంమీద కూచుని గది పరీక్షచేస్తోంది. గదిగుమ్మాలకువేసిన పూసలతెరలనీ, బీరువాలోనున్న బొమ్మలనీ, గోడలకు తగిలించివున్న చిత్రపటాలనీ చూస్తూండగా రాణీదృష్టి ఎదురుగావున్న నిలువుటద్దంమీద పడింది. చప్పట్లు చరుస్తూ మంచంపైన గంతులువేస్తూ 'నాన్నా!నాన్నా! నాకు యిద్దరు నాన్నలు' అన్నది. నాన్ననిర్ఘాంతపోయాడు. పట్టరానికోపంవస్తోంది. అమ్మ చిత్రప్రతిమలాగానుంచుని గడగడలాడుతోంది. ఎవ్వరూమాటలాడలేదు. కాని రాణీమాత్రం అలానవ్వుతూనేవుంది. ఆచిన్నిహృదయంలో ఎట్టిమాలిన్యమునూలేదు. ఆనందసాగరంలో వోలలాడుతోందిరాణి.

నాన్న కలగబారినహృదయాన్ని చిక్కబట్టి మెల్లిగా రాణీదగ్గిరకువచ్చి రాణీ ముఖచంద్రబింబాన్ని తదేకధ్యానంతోచూస్తూ 'అమ్మా! నీకు యిద్దరు నాన్నలేరీ?' అన్నాడు గద్గదికమైన కంఠస్వరముతో.

జవాబుకొఱకు నిరీక్షిస్తున్నాది అమ్మ.

రాణీ ఎప్పటివలె నవ్వుతూ నాన్ననిదగ్గిరకులాగి 'ఇదిగో, నువ్వొకనాన్న, అదిగో, ఇంకోనాన్న అద్దంలో'అన్నాది.

అమ్మ ఒక్కనిముషములో రాణీనుచెక్కిళ్ళపై ముద్దులవర్షం కురిపించేసింది. నాన్న రాణీనెత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. క్షణముక్రింద భయకంపితురాలైన అమ్మా, కోపమూర్తిఅయిన నాన్నాకూడా ఇప్పుడు రాణీనిముద్దులాడుచూ మహానందంతో ఆనిలువుటద్దంలో కనబడుచున్నారు.